# వీడిన ముళ్ళు

తిరుమలశ్రీ

ప్రకృతికి ప్రతిరూపిణి అయిన స్త్రీ ఆదినుంచీ పురుషుణ్ణి అలరిస్తూనే ఉంది.


అతని ప్రగతికీ, పతనానికీ కూడా కారణభూత అవుతోంది...అందం, ఆనందం, లాలిత్యం, మనోపరిపక్వత, కరుణ, జాలి, సహనం, ప్రేమ... సర్వం సంతరించుకున్న అమృత మూర్తి.

అట్టి స్త్రీలో స్వార్థం, అసూయ, ద్వేషం వంటి అవలక్షణాలు కూడా చోటు చేసుకోవడం బుద్ధికి అందని విచిత్రం. జవాబు తెలియని ప్రశ్న. అనాదిగా విడదీయలేకపోయిన చిక్కు ముడి.

భార్య నోరు విప్పినప్పుడల్లా ఇవే ఆలోచనలు జొరబడుతుంటాయి రాఘవ మస్తిష్కంలోకి. రాఘవ భార్య ఊర్మిళ అందమైనది. తెలివైనది. చదువుకున్నదీను. కానీ, ఊర్మిళ అని పేరు పెట్టినందుకు అందుకు తగిన సహనం మచ్చుకైనా కానరాదు ఆమెలో. భర్త, సంసారమూ అంటే ప్రేమాభిమానాలు ఉన్నాయి. ఆమెకిష్టం లేనిదల్లా వయస్సుడిగిన మామగారే.

పేద కుటుంబం నుంచి వచ్చిన రాఘవకు, సంపన్న గృహం నుంచి వచ్చిన ఊర్మిళ అంటే ప్రేమ, అనురాగమూను. అయితే తండ్రి ఆరోప్రాణం.

రాఘవ తండ్రి విశ్వనాథం పిల్లల మనస్సులో విజ్ఞానజ్యోతుల్ని వెలిగించడంలోనే జీవితమంతా కరగించుకున్నాడు. బడిపంతులుగా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దాడు.



## ప్రియదత్త పాఠకులకు విశేషకానుక

మీరు 'ప్రియదత్త' సచిత్ర వారపత్రిక అభిమానులా? మీ స్నేహితులు లేదా బంధువులకు 'ప్రియదత్త' పంపాలని భావిస్తున్నారా!

అయితే మేము మీకందిస్తున్నాము సువర్ణ అవకాశం.

కేవలం మీ మిత్రునికి 20 వారాలు, కాపీ రూ.5/- చొప్పున పోస్టేజితోసహా అందజేస్తాము.

మీరు చేయవలసిందల్లా ప్రియదత్తకు రూ.100/- డి.డి. లేదా ఎం.ఓ. చేయండి.

తరువాత మీరు ఎవరికైతే పత్రికను పంపదలచారో వారి పూర్తి పేరు, చిరునామాలు తెలుపుతూ మాకు పంపండి. ఎం.ఓ. లేదా డి.డి. అందగానే, మీరు సూచించిన మీ మిత్రులకు 'ప్రియదత్త' ను అందిస్తాము.

వారానికి 5 మందికి చొప్పున నాలుగు వారాలు పంపమన్నా మాకు అభ్యంతరం లేదు. దూరప్రాంతాలలో (ఇండియాలో ఎక్కడైనా) వున్న మీ బంధుమిత్రులకు సాహితీ కుసుమంగా అందించవచ్చు.

నేడే ప్రయత్నించి చూడండి. – సర్క్యులేషన్ మేనేజర్

అయిదేళ్ళ క్రితం హెడ్మాస్టరుగా పదవీ విరమణ చేశాడు.

అనుకూలవతియైన భార్య, ఏకైక సంతానం రాఘవ, బళ్ళోని పిల్లలూ, ఇవీ విశ్వనాథం లోకం. తాను, భార్య నోళ్ళు కట్టుకుని కొడుకుని చదివించుకున్నారు. రాఘవ ప్రయోజకుడయి ప్రభుత్వోద్యోగాన్ని సంపాదించిన నాడు ఎంతో పొంగిపోయారు. మంచి సంబంధం చూసి పెళ్ళి చేశారు. కొడుకు ఉద్యోగరీత్యా పట్నంలో కాపురం పెట్టాడు.

రిటైరయ్యాక ఇంటిదగ్గరే పిల్లలకు పాఠాలు చెప్పుకుంటూ గ్రామంలోనే తృప్తిగా కాలం గడపసాగాడు విశ్వనాథం. కొడుకును, కోడల్ని చూడాలనిపించినప్పుడల్లా తానూ, భార్యా పట్నం వెళ్ళి చూసి వస్తూండేవారు. వీలయినప్పుడల్లా కొడుకు కూడా వచ్చి తల్లిదండ్రుల యోగక్షేమాలను తెలుసుకుంటూ ఉండేవాడు, ఎప్పుడోగాని కోడలు రాకపోవడం ఆ ముసలి దంపతుల మనసుల్లో ఓ వెలితిగా కెలికేది.

భార్య పుణ్య స్త్రీగా పుణ్యలోకాలకు తరిలిపోవడంతో వంటరి చెట్టులా మిగిలిపోయాడు విశ్వనాథం. భార్యావియోగం అతడిలో పెద్ద మార్పే తెచ్చింది. ఆలి జ్ఞాపకాలు ఆకలి, నిద్రలను తరిమికొట్టడంవల్ల మనిషి బాగా నీరసించిపోయాడు. ఆరోగ్యం దెబ్బతింది. కొడుకు బలవంతంతో ఉన్న ఊరు వదిలిపెట్టక తప్పలేదు.

తల్లిదండ్రులంటే పంచప్రాణాలూను రాఘవకు. తల్లిని కోల్పోయాక తండ్రిలోనే ఆమెను చూసుకుంటున్నాడు. భార్యకు ఇష్టం లేకపోయినా తండ్రిని తీసుకొచ్చి తనతోనే ఉంచుకున్నాడు.


క్రానిక్ బ్రాంకైటీస్‌తో బాధపడుతూ విశ్వనాథం పూపిరాడక ఉక్కిరి బిక్కిరవుతుంటే, అర్ధరాత్రయినా లేచి సేవలు చేసేవాడు రాఘవ. అర్ధరాత్రీ, అపరాత్రీ అని లేకుండా తరచు భర్త పక్కలోంచి లేచి వెళ్ళడం వొళ్ళు మండించేది ఊర్మిళకు. భర్తతో గొడవ పడేది. ముసలాయన్ని ఇంటినుంచి పంపేయమని చెవిలో జోరీగలా పోరేది. రాఘవ అందుకు వొప్పుకోకపోవడంతో ఇల్లు నరకమయ్యేది. మనశ్శాంతి కరువయ్యేది.

రాఘవకు మూడేళ్ళ కూతురుంది. మనవరాలంటే విశ్వనాథానికెంతో ప్రేమ. ఆ పసిదానిక్కూడా తాతయ్యతో ఆడుకోవాలనుండేది. ఊర్మిళ కూతుర్ని మామగారి దగ్గరకు చేరనిచ్చేది కాదు. తాత కోసం మారాంచేసే పిల్లను దండించేది.

రాఘవ సున్నిత మనస్కుడు. గొడవలంటే ఇష్టముండదు. ఊర్మిళ తన అర్ధాంగి, తల్లి తరువాత తన జీవితంలో ప్రవేశించిన మొట్టమొదటి స్త్రీ. 'ధర్మేచ, అర్ధేచ, కామేచ' తాను తాళికట్టిన మగువ. తనకు సుఖాన్ని అందించే పడతి. తన వంశాన్ని వృద్ధి చేయవలసిన అతివ. చివరివరకూ తనతో జీవితం పంచుకోవలసిన సహచరిణి. ఆమెకు తానంటే ప్రేమ వుంది, అనురాగం వుంది. కానీ, వాటినన్నిటినీ గ్రహణానికి గురిచేస్తున్న అహంకారం, స్వార్థం, ద్వేషం అతని మనశ్శాంతిని దోచుకుంటున్నాయి. నెమ్మది లేకుండా చేస్తున్నాయి.

సీతాకాలం రావడంతో విశ్వనాథం పరిస్థితి ఏమా బాగోలేదు. ఎడతెరిపి లేకుండా నిలవేసే దగ్గుతో, ఎక్కడ ఊపిరి ఆగిపోతుందోనన్నట్టు వుక్కిరి బిక్కిరి చేసే కఫంతో గిలగిల్లాడిపోతున్నాడు. పడుకోలేడు, కూర్చోలేడు. దగ్గలేక, దగ్గే ఓపిక లేక లేచి కూర్చుని తల చేత్తో పట్టుకుని తెల్లవార్లూ అవస్థ పడుతుంటాడు.

'పల్లెలో ఆ ముసలాయన్ని చూసే దిక్కులేదు, సరే! ఓల్డేజ్ హోంలో చేర్పిస్తే అతని బాగోగులు వాళ్ళే చూసుకుంటారు. కనుక మామగారిని ఓల్డేజ్ హోంలో చేర్పించేయమని చెప్పింది ఊర్మిళ భర్తతో. రాఘవ అందుకు ఒప్పుకోలేదు. తాను బ్రతికుండగా తండ్రి అనాథలా జీవితాన్ని గడపడం తాను సహించలేడు. ఆ విషయమే ఖచ్చితంగా చెప్పాడు. భర్త తన సలహాను ఖాతరు చేయకపోవడం అవమానంగా తోచింది ఊర్మిళకు. ఆమె అక్కసునీ, ఆగ్రహాన్ని అధికం చేసింది. దాంతో సంసారం తుఫాను రేగిన సాగరమయింది. ఊర్మిళ భర్తమీద యుద్ధం ప్రకటించింది. మానసికంగా అతన్ని



హింసించసాగింది. మధ్యలో చంటిపిల్ల నలిగిపోతోంది.

ఇంటి వాతావరణాన్ని అర్థం చేసుకున్న విశ్వనాథానికి జీవితం మీద విరక్తి కలిగింది. తన చావేదో తాను చస్తాడు. పల్లెకు పంపెయ్యమంటే కొడుకు వొప్పుకోడు. పోనీ తానే ఎలాగో చెప్పకుండా వెళ్ళిపోదామను కుంటే కొడుకు మనసు కష్టపెట్టలేడు..

రాఘవకు మనశ్శాంతి కరువయింది. మరికొంతకాలం పరిస్థితి అలాగే కొనసాగితే అసలు మనస్సే విరిగిపోతుందనిపించింది. ఊర్మిళ రూపసి వేషంలోని రక్కసి అనిపిస్తోంది. చదువుకున్న కుసంస్కారి ఆమె. ఆమెను ఇంటి నుంచి తరిమేయాలన్నంత కసిగా ఉంటోంది. ఆ సంసారానికీ, ఇంటికీ, జీవితానికీ దూరంగా పారిపోవాలనిపిస్తోంది. బంధాలూ, అనుబంధాలూ అన్నీ తెంచుకుని ఏ హిమాలయాలలోనో తల దాచుకోవాలనిపి స్తోంది. త్వరలో ఆ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనలేకపోతే ఎదురయ్యే పరిణామాలు అనూహ్యం. వెంటనే ఏదో ఒకటి చేయాలి తాను. కానీ, ఏం చేయాలన్నదే ప్రశ్న.

ఆ రోజు ఉదయం భర్తకు అల్టిమేటమ్ ఇచ్చేసింది ఊర్మిళ. ఇరవై నాలుగ్గంటల్లో ముసలాయన్ని ఇంటి నుంచి పంపించివేయక పోతే, పిల్లను తీసుకుని తానే వెళ్ళిపోతుంది. ముసలాయన ఉండగా మళ్ళీ ఆ ఇంట్లోకి కాదు, రాఘవ జీవితంలోనే అడుగుపెట్టనని వొట్టేసుకుంది. రాఘవ హతాశుడయ్యాడు. భార్యకు నచ్చజెప్పే స్థాయి దాటిపోయింది. కర్తవ్యతా మూఢుడై రోజంతా పిచ్చివాడిలా ఎక్కడెక్కడో తిరగసాగాడు.

తల నెరసిన తండ్రికి కొడుకు అసహాయ స్థితి అర్థమయింది, ఆందోళన కలిగించింది. అతని మనసులో తీవ్ర సంక్షోభం చెలరేగింది. చివరికి ఏదో నిశ్చయానికి వచ్చినవాడిలా కాగితం, కలం తీసుకున్నాడు విశ్వనాథం. రాస్తుంటే చేతులు వణికాయి. బలహీనతతో కాదు, జీవితమంతా విద్యార్థులకు ధైర్యం నూరిపోసిన తాను, జీవితపు చరమాంకంలో పిరికి మందు తాగుతున్నందుకు! ఉత్తరం ముగించి సంతకం పెట్టాడు. నిద్ర మాత్రల సీసా అందుకున్నాడు.

అదే క్షణంలో బయటనుంచి 'కెవ్వు'మన్న మనవరాలి ఆర్తనాదం వినిపించింది. వెనువెంటనే కోడలి అరుపులూ, కంగారుగా పరుగెడుతున్న ఆమె పాదాల చప్పుడూను.

విశ్వనాథం చేతిలోని సీసా జారిపోయింది. మనవరాలికేదో జరిగిందన్న కంగారుతో లేచి గబగబా బయటకు వెళ్ళాడు.

పాప టెర్రేస్‌మీద ఆడుకుంటూ కింద పడిపోయింది. నుదుటికి పెద్ద గాయమే అయింది. రక్తం ధారలు కట్టింది. పిల్ల భయంతో తెలివి తప్పిపోయింది. ఊర్మిళ ఏడుస్తూ కూతుర్ని ఒళ్ళోకి తీసుకుంది.

ఆ దృశ్యం విశ్వనాథం గుండెల్ని గుభేలుమనిపించింది. తక్షణమే ఆటో పిలిపించి పాపను తీసుకుని హాస్పిటల్‌కి బయలుదేరాడు. కూడా వస్తానన్న కోడల్ని వారించి, పక్కింటి కుర్రాణ్ణి సాయం తీసుకుని వెళ్ళాడు, లేని వోపికను ఎరువుతెచ్చుకుంటూ.

ఊర్మిళకు భయంగా వుంది పిల్లకెలావుందోనని. కూడా వెళదామంటే ఆ ముసలాయన పడనివ్వలేదు. పిల్లను ఆ స్థితిలో చూసి తట్టుకోలేదని కాబోలు. కానీ, పిల్ల తిరిగొచ్చేంతవరకు టెన్షన్‌గానే ఉంటుంది. సమయానికి భర్తకూడా దగ్గరలేడు. ప్రొద్దుటనగా వెళ్ళినవాడు ప్రొద్దుగుంకుతున్నా అయిపులేడు. ఆ రోజు ఆదివారం, ఆఫీసుకు సెలవు. ఎక్కడ ఏం రాచకార్యాలు వెలగబెడుతున్నాడో? భర్తమీద కోపం ముంచుకొచ్చిందామెకు. కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా తిరగసాగింది.

అదిగో, అప్పుడే పడింది ఆమె దృష్టి మామగారి గదిలో నేలమీద పడున్న కాగితం మీద. ఏమిటోనని తీసి చూస్తే విశ్వనాథం కొడుక్కి రాసిన ఉత్తరం. కుతూహలం ఆమె చేత చదివించింది.

"నాన్నా రాఘవా! ... అతను కొడుకును ప్రేమతో పిలుచుకునే పిలుపది. నీ అసహాయ స్థితి, మనోక్షోభ నాకర్థమయ్యాయిరా. నీకు నేను కావాలి. నీ భార్యా బిడ్డలు కావాలి. ఒకరి కోసం మరొకర్ని వదులుకునే మనస్తత్వం కాదు నీది. అందుకే మానసికంగా నలిగి పోతున్నావనీ ఎరుగుదును. నాన్నా! ఏదో క్షణంలో రాలిపోనున్న పండుటాకును నేను. ఎదుట బోలెడు జీవితం ఉంది మీకు. నీ భార్యను కాదని నీ బ్రతుకును శూన్యం చేసుకోకు. ఊర్మిళ చెడ్డది కాదు. తనదైన కుటుంబంతో జీవితం అనుభవించవలసిన వయసులో వయస్సుడిగిన ఓ జబ్బు మనిషికి చాకిరీ చేయలేక విసుక్కోవడంలో సబబు వుంది. అర్థముంది. ఆమెను ఏమీ అనకు. పాపను జాగ్రత్తగా చూసుకోండి. ఆ మధ్య ఎందుకో మీ అమ్మను చూడాలన్న కోర్కె నిలవనీయడం లేదు నన్ను. అందుకే ఈ తొందర.. నన్ను క్షమిస్తావు కదూ? మీకు నా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి... నాన్న, విశ్వనాథం."

## వసుంధరరాజే పూజా కార్యక్రమాలు



ఉమాభారతికి వాస్తులో వాస్తవం ఎంతో తెలిసినా తెలియకపోయినా, వసుంధర రాజే సింథియా మాత్రం పూజలు పునస్కారాలు మేలు చేస్తాయని నమ్ముతున్నారు. అందుకే ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 155 ప్రార్థనా మందిరాలను ఎన్నిక చేసి ప్రత్యేక పూజలు చేయవలసిందిగా ఆదేశాలు జారీచేశారు. వీటిలో దేవాలయాలు, గురుద్వారాలు, మసీదులు, చర్చిలు అన్నీ వున్నాయట! ఏమిటీ తతంగం అంటే అంతా రాష్ట్రాభివృద్ధికోసమే అంటున్నారు వసుంధరరాజే సింధియా.

అవును ఎవరి నమ్మకం వారిదే మరి!

*- జె. గాయత్రి*


## కాదేదీ కవితకనర్హం

నా ఇంట్లో కుక్కపిల్ల
వేసిన నాలుగు మెతుకులు కతికి
శత్రు రాకను తక్షణం పసిగడుతుంది...
నా ఇంట్లో సబ్బుబిళ్ళ
ఒంటి మురికిని వదిలించేందుకు
నిరంతరం తను కరిగిపోతుంది
నా ఇంట్లో అగ్గిపుల్ల
చిమ్మచీకట్లను చెదరగొట్టి
వెలుగు విస్తరణకై ప్రయత్నిస్తోంది...
విపత్కర స్థితిని ఎదుర్కొంటే
గెలుపు తలుపు తడుతుంది
వినూత్నంగా ఆలోచిస్తే
నవకవిత నడచి వస్తుంది

*- గుండాన జోగారావు*

## వెంకీ కామిడీ సినిమా!

వెంకటేష్ త్వరలో ఓ కామిడీ సినిమా తీయబోతున్నట్లు బోగట్టా! సీరియస్ క్యారెక్టర్లతో పాటు కామిడీ పండించడంలోనూ వెంకటేష్ దిట్ట! దాంతో హిందీలో సంజయ్‌దత్ నటించిన 'మున్నాభాయ్ ఎం.బి.బి.ఎస్' సినిమాని తెలుగులో రీమేక్ చేయబోతున్నట్లు టాలీవుడ్ ఉవాచ. దీనిని స్వంత బ్యానర్‌మీద నిర్మించేందుకు రీమేక్ హక్కులకోసం సురేష్‌బాబు ప్రయత్నిస్తున్నారని టాలీవుడ్ టాక్.



కొయ్యబారిపోయింది ఊర్మిళ. అంతలోనే మంచంమీద పడున్న నిద్రమాత్రల సీసా కనిపించింది.

విషయం ఆకళింపయ్యేసరికి గుండె ఝల్లుమంది ఆమెకు. పాప కేకతో మధ్యలో కంగారుగా లేచొచ్చాడతను. లేకుంటే ఆ పాటికి..?

దుఃఖం ముంచుకొచ్చిందామెకు. తన మూర్ఖత్వం వల్ల ఎంతటి దారుణం జరిగిపోయేది! అదేగాని జరిగుంటే రాఘవ తనను జీవితంలో క్షమించేవాడేనా? చదువుకున్నదీ, సంస్కారవంతమైన కుటుంబం నుంచి వచ్చినదీ అయివుండీ ఎందుకంత మూర్ఖంగా ప్రవర్తించింది తాను! స్నేహితురాలెవరో వేసిన విషబీజం మూలంగా మామగారి పొడ కిట్టకుండా ప్రవర్తించింది. స్వార్థం తన సంస్కారానికి ముసుగేసిన మాట సత్యమే! కానీ, మామగారి చావునెప్పుడూ కోరుకోలేదు తాను...

అసలు పెద్ద దిక్కంటూ వుండబట్టేగదా, పాపకు అంత పెద్ద ప్రమాదం సంభవిస్తే తనకు ధైర్యం చెప్పి, వోపిక వుడిగినా చటుక్కున చంటిదాన్ని హాస్పిటల్‌కి తీసుకెళ్లాడు. సమయానికి మామగారే లేకుంటే తాను ఒక్కతీ ఏం చేయగలిగేది? ఓసారి తనకు విషజ్వరం వచ్చి వారం రోజులపాటు మంచం పడితే, కొడుకు ఆఫీసుకు సెలవుపెట్టనవసరం లేకుండా, తనకు వేళకు మందులు, ఆహారం ఇస్తూ కంటికి రెప్పలా కనిపెట్టుకునుండి సేవ చేయడమేకాక, చంటిదాన్ని కూడా శ్రద్ధగా చూసుకున్నాడు మామగారు. అతని మూలంగానే తాను త్వరగా కోలుకోగలిగిందని డాక్టరు కూడా అన్నాడు. కానీ, తన కళ్ళకు పొరలు కమ్మడంతో, అదంతా కొడుకును మంచి చేసుకోవడానికి అతను చేసిన నటన అని తాననుకుంది. ఛ! తండ్రిలాంటి మామగారిని క్షోభ పెట్టడానికి తనకు మనసెలా ఒప్పింది? తన వివేకం ఏమయింది?.. చిన్నదైనా పెద్దదైనా, ఏ సంఘటన ఎప్పుడు ఎవరిలో ఏం మార్పు తెస్తుందో చెప్పడం కష్టం. ఇప్పుడు ఊర్మిళ విషయంలోనూ అదే జరిగింది.

తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపంతో పరిపరివిధాలుగా కుమిలిపోతున్న ఊర్మిళ, విశ్వనాథం పాపకు కట్టు కట్టించి తీసుకొచ్చేసరికి ఏడుస్తూ కూర్చుంది.

"పాపకేమీ పరవాలేదమ్మా. డాక్టర్‌గారు కట్టుకట్టి ఇంజెక్షనిచ్చారు. గాయం త్వరలోనే నయమయిపోతుందన్నారు" అంటున్న విశ్వనాథం కాళ్ళమీద పడిపోయింది ఊర్మిళ, "నన్ను క్షమించండి, మావయ్యా!"

విశ్వనాథం తెల్లబోయాడు. "ఏమిటమ్మా? ఏమయింది?" అన్నాడు కంగారుపడుతూ.

"మీ పట్ల అమానుషంగా ప్రవర్తించాను. దేవుళ్ళాంటి ఆయన్ని క్షోభ పెట్టాను. నా అజ్ఞానాన్ని మన్నించండి. మీరు క్షమించానంటే తప్ప నాకు నిష్కృతి లేదు" అంది ఊర్మిళ లేకుండా.

విశ్వనాథానికి విషయం అర్థమయి అవనట్లుంది. కోడల్ని లేవదీసి ఆప్యాయంగా తల నిమిరాడు. "లోకంలో తప్పుచేయని వారుండరమ్మా. కానీ, తమ తప్పు తెలుసుకుని దాన్ని సరిదిద్దుకునేవారు ఉన్నతులు" అన్నాడు.

మామగారి హృదయానికి హత్తుకుపోయిందామె, తన కన్నీటితో అతని వక్షం తడిపేస్తూ, ఆ క్షణాలు అతనిలో కన్న తండ్రే కనిపించాడామెకు.

అప్పుడే ఇంట్లో అడుగుపెట్టిన రాఘవ ఆ అపురూపమైన దృశ్యం చూసి అయోమయానికి గురైనా, అంతలోనే ఆనందం తన్నుకొచ్చింది. అంతవరకూ దిగులుతో గుబులుగా వున్న గుండె తేలికపడినట్లయింది. అతని కన్నుల నుండి ఆనందబాష్పాలు పూలజల్లులా జలజలా రాలాయి. ☆


100% AYURVEDIC PRODUCT

గ్యాస్‌ట్రబుల్‌తో బాధపడుతున్నారా?
మలబద్ధకము తో
ఇబ్బంది పడుతున్నారా?
కడుపునొప్పి మొదలగు జీర్ణశక్తికి సంబంధించిన వ్యాధులకు అనేక సంవత్సరముల నుండి ప్రయోగములు చేసి చంద్రికా వారిచే తయారుచేయబడినటువంటి అతి ఉత్తమమైన ఆయుర్వేద మందు

క్యాప్‌జైమ్
చూర్ణము




జీర, ఇంగువ, సైంధవలవణం, యవాక్షారము, ఇసఫ్‌గోల్, మారీచము మొదలగు అనేక రకములైనటువంటి అతి ఉత్తమమైన ఆయుర్వేద మూలికలతో తయారుచేయబడినది.

ఈ క్యాప్‌జైమ్ చూర్ణమ్ తీసుకొనుట వలన ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ రావు

మార్కెట్ చేయువారు
రామా మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ & కొ.
పార్కురోడ్, విజయవాడ - 1. ఫోన్ : 2424133.